క్లుప్తంగా

జుజ్జూరులో పోలీసు కవాతు



వీరులపాడు: మండల పరిధిలోని జుజ్జూరులో ఎస్‌ఐ మహాలక్ష్మణుడు ఆధ్వర్యంలో శనివారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మహాలక్ష్మణుడు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించిన ప్రజలకు అభినందనలు తెలియజేశారు. జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ రోజు కూడా ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలో 144 సెక్షన్ ఉన్నందువల్ల ప్రజలెవరు గుమ్మికూడి ఉండవద్దని సూచించారు. కౌంటింగ్ రోజు అనుమతి లేకుండా ర్యాలీలు, డీజేలు వంటివి ఏర్పాటు చేయవద్దన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అందుబాటులోకి ఘాట్‌రోడ్డు



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని కొండపై నున్న స్వయంభు జ్వాలా నరసింహస్వామివారి సన్నిధానానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఘాట్ రోడ్డు అందుబాటులోకి వచ్చిందని ఈవో హేమలతాదేవి తెలిపారు. గతంలో ఘాట్ రోడ్డు లేకపోవడంతో గతంలో ఆలయానికి వెళ్లేందుకు భక్తులు నడకదారినే ఆశ్రయించేవారు. భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్‌కు చెందిన దాత డాక్టర్ యు.హరి సహకారంతో ఘాట్ రోడ్డు నిర్మించారు. దీంతో భక్తులు వాహనాల ద్వారా కూడా కొండపైకి వెళ్లే సదుపాయం ఏర్పడింది. కొండపైకి వెళ్లేందుకు ఘాట్‌రోడ్డు సదుపాయం అందుబాటులోకి రావడంపై భక్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

కారును ఢీకొట్టిన లారీ



నందిగామ: జాతీయ రహదారిపై ఓ కారును వెనుకనుంచి లారీ ఢీకొట్టిన ఘటన శనివారం సాయంత్రం నందిగామ మండలం అంబారుపేట సత్యమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..ఆలయ సమీపంలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటుండటంతో ప్రమాదాల నివారణ కోసం పోలీసులు జాతీయ రహదారిపై స్టాప్‌బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం హైదరాబాదు వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఓ కారును డ్రైవర్ సడన్‌గా స్టాప్ బోర్డు వద్ద కుడిచేతి వైపునకు తిప్పాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఓ లారీ ఈ కారును ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లయింది.

నిమిషాంబకు ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట అర్బన్: వైశాఖ మాస శుద్ధదశమి సందర్భంగా ఆర్య క్షత్రియ కులదేవత నిమిషాంబకు స్థానిక ఆర్య క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా స్థానిక నకాశిబజారులో కొలువైన శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఉన్న నిమిషాంబ అమ్మవారికి వేదపండితుల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కుల పెద్ద 95 ఏళ్ల వయస్సు కలిగిన కేతవరపు వెంకటేశ్వర్లు, గాజర్ల దుర్గాబాబు, గాజర్ల నాగేశ్వరమ్మ, కేతవరపు నరసింహారావు దంపతులను ఆర్యక్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఏపీ ఆర్య క్షత్రియ సంక్షేమ సంఘ గౌరవ అధ్యక్షుడు కేతవరపు చంద్రశేఖర్, పట్టణ గౌరవాధ్యక్షుడు కేతవరపు లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జి.ప్రభాకర్, కె.కనకం తదితరులు పాల్గొన్నారు.

'శ్రీమాతా వైభవం' ప్రవచనానికి భక్తులకు ఆహ్వానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల వైభవాన్ని శ్రీమాతా వైభవం ద్వారా చాగంటి కోటేశ్వరరావు వివరించనున్నారని, కార్యక్రమానికి అమ్మవారి భక్తులందరికీ ఆహ్వానం పలుకుతున్నామని దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు పేర్కొన్నారు. 24, 25వ తేదీల్లో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు చాగంటి కోటేశ్వర రావుచే నిర్వహించే ప్రవచనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను దేవస్థానం చేస్తోందన్నారు. అమ్మవారి ప్రవచన కార్యక్రమం విజయవాడ ప్రజలందరికీ ఆధ్యాత్మిక అనుభూతిని ఇస్తుందని చెప్పారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా చర్చలు

- ఓట్ల లెక్కలతో కుస్తీపడుతున్న రాజకీయ నాయకులు, కార్యకర్తలు
- గెలుపోటములపై చర్చోపచర్చలు



కంచికచర్ల : సార్వత్రిక ఎన్నికల్లో నందిగామ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు అనే అంశంపై ప్రజల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఆయాపార్టీల నాయకుల్లో గెలుపుపై ఎవరి అంచనాలు వారికి ఉండగా, ఎవరి ధీమాలో వారు ఉన్నారు.

87.58శాతం పోలింగ్ నమోదు..

నందిగామ నియోజకవర్గంలో మొత్తం 2,05,480మంది ఓటర్లు ఉండగా, 1,79,952మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటుహక్కును వినియోగించుకున్నవారిలో పురుషులు 87,769మంది, మహిళలు 92,179మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు నలుగురు ఉన్నారు. నియోజకవర్గంలో 87.58శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల పోలింగ్ ముగిసి ఆరు రోజులవుతున్నా, ఎన్నికల వేడి మాత్రం గ్రామాల్లో ఇంకా తగ్గలేదు. ఓట్ల లెక్కింపు మరో 15రోజులు ఉంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఏప్రాంతంలోనైనా నలుగురు వ్యక్తులు ఒకచోట గుమిగూడితే చాలు ఎన్నికల ఫలితాలు.. మెజార్టీలపై జోరుగా చర్చ సాగుతోంది. గ్రామాల్లో ఈ పరిస్థితి మరింత అధికంగా ఉంది. అధికార వైఎస్సార్ సీపీకి ఎందుకు మెజార్టీ రానుంది. ఏఏ ఓటర్లు ఏ పార్టీకి మొగ్గుచూపుతున్నారన్న రచ్చబండ చర్చలు జోరుగా సాగుతున్నాయి. అంతేకాకుండా సామాజికవర్గాల ప్రకారం ఎవరు, ఏ పార్టీ వైపు మొగ్గు చూపేందుకు అవకాశం ఉందన్న చర్చ కూడా నడుస్తోంది. పోల్ మేనేజ్‌మెంట్ ప్రభావం ఎంత?.. ఆయా పార్టీలకు అనుకూలంగా ఉండే అంశాలేంటి..ప్రతికూల అంశాలు ఏమిటి అనే విషయాలను జనం చర్చిస్తూ గెలుపు లెక్కలు వేస్తున్నారు. అభ్యర్థుల వారీగా బలాలు, బలహీనతలు, ఎన్నికల వాతావరణం, గ్రామాల వారీగా మెజార్టీ వచ్చేందుకు ఏ పార్టీకి అవకాశం ఉందన్న లెక్కల్లో జనం తనమునకలవుతున్నారు.

ఓటింగ్ వివరాలపై ఆరా...

నందిగామ నియోజకవర్గంలో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులంతా మండలాలు, గ్రామాల వారీగా పోలింగ్ నమోదుపై దృష్టిసారించారు. గ్రామాల వారీగా తమ వైపు నిలబడే ఓటర్ల లెక్కలను గ్రామస్థాయి నాయకుల ద్వారా ఆరా తీస్తున్నారు.

ఫోన్ సంభాషణల్లోనూ రాజకీయ చర్చలే..

ఇతర ప్రాంతాల్లోని బంధువులు, స్నేహితుల నుంచి ఇక్కడివారికి వచ్చే ఫోన్లలో కూడా ఈ ఎన్నికల సంభాషణలే అధికంగా ఉంటున్నాయి. నందిగామలో ఎవరు గెలుస్తున్నారంటూ ఫోన్లలో సైతం జోరుగా చర్చిస్తున్నారు. నియోజకవర్గ చర్చలకు తోడు పక్కనే ఉన్న జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు, విజయవాడ పార్లమెంటు, దాని పరిధిలోని ఆయా నియోజకవర్గాల్లో ఎవరు గెలుస్తారంటూ జోరుగా చర్చలు సాగుతున్నాయి.

సోషల్ మీడియా గప్‌చుప్....

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలుగా ఎన్నికల ప్రచారానికి మరో వేదికగా మారిన సోషల్ మీడియా సైతం ప్రస్తుతం స్తబ్దుగా మారింది. ఎన్నికల పోలింగ్ ముగియడంతో సోషల్ మీడియా ఒక్కసారిగా మూగబోయింది. వాట్సాప్ మెసేజీలు, అభ్యర్థుల బ్రాడ్‌కాస్టింగ్, ఇన్‌స్టా, రీల్స్, ఎక్స్ పోస్టర్లతో దద్దరిల్లిన సోషల్ మీడియా హడావుడి ఆరురోజులుగా గప్‌చుప్ అయిపోయింది.

ఓటుకు వేలాది మంది దుమ్మా..

ఈసారి పోలింగ్ శాతం ఎక్కువగా నమోదయినప్పటికీ నందిగామ నియోజకవర్గంలో 20వేల మందికి పైచిలుకు ఓటర్లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. నందిగామ పట్టణంతో పోల్చితే మండలాల్లోని గ్రామాల్లో అధికశాతం పోలింగ్ నమోదైనప్పటికీ నియోజకవర్గవ్యాప్తంగా వేలాది మంది ఓటర్లు ఓటింగ్‌కు దూరంకావడం చర్చనీయాంశం. గ్రామాల్లో అధికశాతం పోలింగ్ నమోదు కావడం అధికారపార్టీకి అడ్వంటేజ్‌గా ఉంటుందనే చర్చ... రాజకీయ వర్గాలతోపాటు ప్రజల్లోనూ జోరుగా సాగుతోంది.

20 నుంచి సువార్త స్వస్థత సభలు

కంచికచర్ల : మండలంలోని కీసర బ్రిడ్జి సమీపంలో పరలోక మన్నా మినిస్ట్రీస్ వారు ఆధ్వర్యంలో క్రీస్తు సువార్త స్వస్థత నది సభలు ఈనెల 20వతేదీ నుంచి మూడురోజులపాటు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ ఎం.యోహాన్ శనివారం తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం ఆరుగంటలకు ఈ సభలు ప్రారంభమవుతాయని వివరించారు. సభలకు ముఖ్య ప్రసంగీకులుగా డాక్టర్ బొక్కా జార్జిముల్లర్(నందిగామ), పాస్టర్ టి.ఏలిమెజెస్ (కోదాడ), పాస్టర్ కె.యోసుబాబు(కోదాడ) హాజరవుతారని తెలిపారు. విశ్వాసులు, భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వీరులపాడు: మండలంలో జూన్ పదోతేదీ వరకు 144 సెక్షన్ విధించినట్లు మండల మేజిస్ట్రేట్ , తహసీల్దార్ రాజకిషోర్ శనివారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం అల్లర్లు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నార. నలుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందస్తు అనుమతులు లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించారాదన్నారు. ముఖ్యంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు నిబంధనలకు అనుగుణంగా నడుచుకుని శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని తహశీల్దార్ కోరారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



వత్సవాయిలో విద్యార్థులకు మెమెంటోలను అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు



జగ్గయ్యపేటలో ప్రతిభచూపిన విద్యార్థులతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు

వత్సవాయి : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సూచించారు. వత్సవాయి జెడ్పీ పాఠశాలలో శనివారం జిల్లేపల్లి యేసురత్నం, నాగరత్నం జ్ఞాపకార్థం పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలను అందజేసి అభినందించారు. మండలంలో ప్రథమ స్థానం సాధించిన గురుకుల పాఠశాలకు చెందిన ఎస్‌కే ఇస్మాయిల్, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన జెడ్పీ పాఠశాల విద్యార్థినులు గుంటూరు రాజ్యలక్ష్మి, మాతంగి కీర్తనభాయిలను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరుమీదుగా ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుడు జిల్లేపల్లి సుధానంద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు ఆశలు, ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. భవిష్యత్‌లో అత్యుత్తమ ఫలితాలను సాధించాలంటూ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఆర్ అశోక్‌కుమార్, జరీనా, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం కృష్ణయ్య, నాయకులు ఎస్‌కే హుస్సేన్, అల్లిక నరసింహరావు, జి.ముక్తేశ్వర రావు, జి.పల్లవి, సీఆర్పీ యేశపోగు రవిబాబు, గోవర్ధన్, బాబురావు, పురుషోత్తమ్, గోవిందయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు మండలాల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య అధ్యక్షతన ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు శనివారం మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. విద్యార్థులను భవిష్యత్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని వారికి సూచించారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, కవి,ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, సత్యావతి, రమేష్ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఇటీవల రోడ్డు ప్రమాదాలలో గాయపడి కోలుకుంటున్న ఉపాధ్యాయులు పులి శ్రీనివాసరావు, ఏజే.గోవిందన్‌లను పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు అబ్దుల్ ఘనీ, పోపూరి పాపారావు కుటుంబసభ్యులను పరామర్శించారు.

వేసవిలో దొంగలతో జరజాగ్రత్త

- అప్రమత్తంగా ఉంటే చోరీలు అరికట్టవచ్చు
- ప్రజలకు పోలీసుల సూచనలు



పెనుగంచిప్రోలు: వేసవి అంటే కేవలం ఉక్కపోత..తట్టుకోలేని వేడి...వడదెబ్బ మాత్రమే కాదు. దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయి. ఉక్కపోత తట్టుకోలేక ప్రజలు ఆరుబయట హాయిగా నిద్రిస్తుంటే దొంగలు చక్కగా ఇళ్లల్లోకి చొరబడి బీరువాల్లో ఉండే నగదు, బంగారం, వెండి వస్తువులు అపహరిస్తుంటారు. వేసవిలో శుభకార్యాలకు, విహార, తీర్థయాత్రలకు , ఊళ్లకు వెళ్లేవారు ఇళ్లకు తాళాలు వేసి వెళ్తుంటారు. వీరి ఇళ్లనే ముఖ్యంగా దొంగలు టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతుంటారు.

ఇటీవల జగ్గయ్యపేటలో నాలుగు ఇళ్లల్లో ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగతనాలు చేసి నగదు, బంగారం చోరీ చేయడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ యాప్ ద్వారా తమకు సమాచారం అందిస్తే వారి ఇళ్లపై నిఘా పెడతామని పోలీసులు చెబుతున్నారు. అయితే ఇది అన్ని చోట్ల ఇంకా అమలులోకి రాలేదు. పోలీసులు కూడా ప్రతి ఇంటిని నిత్యం గమనిస్తూ ఉండటం సాధ్యం కాదు. అందుకే ప్రజలు చైతన్యవంతులుగా మారడంతో పాటు అప్రమత్తంగా ఉండి కింద తెలిపిన కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వేసవి కాలంలో జరిగే దొంగతనాల నుంచి కొంతవరకు రక్షించుకోవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.

చోరీలు జరగకుండా పోలీసుల సూచనలు..

- ఇంటికి ఉన్న కిటికీలు మూసివేయాలి. వాటికున్న బోల్టులు సక్రమంగా ఉన్నాయో, లేదో ఎప్పటికప్పుడు చూసుకుంటుండాలి.
- దుస్తుల్లో డబ్బులు పెట్టి కిటికీలు, గోడలకు తగిలించరాదు.
- ఆరుబయట, మిద్దెలపై నిద్రించేవారు అప్రమత్తంగా ఉండాలి. ఇంటికి తప్పకుండా తాళాలు వేసుకోవాలి.
- బంగారు ఆభరణాలు ధరించి బయట నిద్రించకూడదు. ఇంట్లో పడుకున్నా కిటికీలు తెరిచి ఉండే వైపు నిద్రించరాదు.
- వీలైతే ఇంటి ఆవరణలో పెంపుడు కుక్కలను కట్టి ఉంచాలి. ఇంట్లో ఎలాంటి శబ్దం, అలికిడి వినిపించినా వెంటనే అప్రమత్తం కావాలి. అలసత్వం ప్రదర్శించరాదు.
- దూరప్రాంతాలకు వెళ్లేవారు ఇంటి చిరునామా, ఫోన్‌నంబర్‌ను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలి.
- రాత్రి సమయంలో కొత్తవారు ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.
- ఇంట్లోని బంగారం, నగదును బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవడం మంచిది.

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం..



వేసవిలో పెనుగంచిప్రోలు మండలంలో చోరీల నియంత్రణకు చర్యలు చేపట్టాం. ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేస్తున్నాం. ప్రజలు కూడా తగు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా ఆరుబయట నిద్రించేవారు బంగారం నగలు శరీరంపై లేకుండా చూసుకోవాలి. వీలైనంతగా నగదు, బంగారం నగలు బ్యాంక్‌లో భద్రపరుచుకోవడం మంచిది.

– పి రాంబాబు, ఎస్‌ఐ, పెనుగంచిప్రోలు

ఘనంగా అమ్మవారి జయంతి వేడుకలు



నందిగామ: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పలు రకాల అర్చనలు చేశారు. అనంతరం 108 కళాశాలలో ప్రత్యేకంగా తీసుకువచ్చిన సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. లక్ష మల్లెల అర్చన, సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణం, హోమాది కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంసంధ్యా సమయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని స్థానిక జాతీయ రహదారి పక్కన ప్రజలకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా వాసవి యువసేన అధ్యక్షుడు జూలూరు విశ్వనాధం మాట్లాడుతూ దాతలు మారేపల్లి సతీష్, మాటూరు చెన్నకేశవ రావు సహకారంతో పులిహోర పంపిణీ చేసినట్లు చెప్పారు. ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. యువసేన నాయకులు శ్రీకాంత్, యశ్వంత్, అనుదీప్, ఈశ్వరరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి జయంతిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా గోపూజ చేశారు. అనంతరం అమ్మవారికి మామిడి పండ్లతో ప్రత్యేకసహస్రనామార్చన, సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షులు పోలా పూర్ణచంద్రరావు, ఆలయ కమిటీ చైర్మన్ కొత్త వెంకట నరసింహరావు, మండల మహిళా అధ్యక్షురాలు అద్దగిరి కళావతి, బొగ్గవరపు రమాదేవి, దుగ్గి శైలజ, కొత్త ఆదిలక్ష్మి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కంచికచర్లలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు



వత్సవాయిలో గోపూజ చేస్తున్న భక్తులు

విజ్ఞాన శిబిరాలతో ఎంతో మేలు



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్

కంచికచర్ల : వేసవికాలంలో గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తున్న విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు అల్లూరి రామచంద్రుడు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని రెండోరోజు శనివారం నిర్వహించారు. తొలుత అంతర్జాతీయ మ్యూజియం డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ, 1977లో అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం ప్రారంభమైందని తెలిపారు. విజ్ఞాన శిబిరాలతో ఎంతో మేలు ఉంటుందని, ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఆయా అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు చెస్, యోగా నేర్పించారు. ఎం.కనకారావు, బిడిసి నిర్వాహకుడు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న జిల్లా గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు శనివారం సందర్శించారు. గ్రంథాలయానికి ఆంధ్రుల సామాజిక సాంస్కృతిక చరిత్రకు సంబంధించిన పది పుస్తకాలను బహూకరించారు. శిబిరంలో భాగంగా జెడ్పీ బాలుర హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ వినోద్ బాబు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీదే విజయం : లాహోరి



మాట్లాడుతున్న లాహోరి బద్దూనాయక్, పక్కన బూడిద నరసింహారావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్ : బడుగు బలహీన వర్గాలంతా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ వైపే ఉన్నారని, ఈ ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ మరోసారి చారిత్రక విజయాన్ని నమోదు చేయనుందని ఆ పార్టీ రాష్ట్ర ఎస్టీ విభాగం కార్యదర్శి లాహోరి బద్దూనాయక్ అన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలు, పెత్తందార్లకు మధ్య జరిగిన ఎన్నికల యుద్ధంలో పేదలే విజేతలుగా నిలువనున్నారన్నారు. బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన సంక్షేమ పాలనను ప్రజలకు అందిస్తున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను అక్షరాల తన పాలన ద్వారా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరొందారని కొనియాడారు. పార్టీ ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బూడిద నరసింహారావు మాట్లాడుతూ అర్ధరాత్రి వరకు జరిగిన పోలింగ్‌లో మహిళలు ఓపిగ్గా ఉండి ఓటేశారని, ఇది వైఎస్సార్ సీపీ విజయానికి సంకేతమని పేర్కొన్నారు. పేట నియోజకవర్గంలో సామినేని ఉదయభాను చేసిన అభివృద్ధే ఆయనను మరలా ఎమ్మెల్యేగా గెలిపించి తీరుతుందని ధీమా వ్యక్తంచేశారు. సమావేశంలో అనుమంచిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు కుందవరపు సుబ్బారావు, రామిరెడ్డిపల్లి బూత్ కమిటీ అధ్యక్షుడు వీరమాచనేని నాగమల్లేశ్వరరావు, బూత్ కన్వీనర్ నల్లపు ఆదాం, నాయకులు అబ్బూరి చౌదరిబాబు, కట్టా పెద్ద మరియన్న, ఆర్ఎన్.తండా నాయకుడు జర్పుల సైదా పాల్గొన్నారు.

30 నుంచి హనుమజ్జయంతి వేడుకలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ ఈవో భవాని

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని తెలిపారు. స్థానిక దాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 30వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటలకు శ్రీ విష్వక్సేన పూజ అంకురార్పణతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. స్వామివారికి విశేషంగా మన్యసూక్త పారాయణం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని చెప్పారు. 31వ తేదీ శుక్రవారం ఉదయం 5.30 గంటలకు నిత్యారాధన, పంచామృత స్నపనం, నాగవల్లీదళ సహస్ర నామార్చనలు ఆలయ అర్చకులచే శాస్త్రోక్తంగా జరుగుతాయన్నారు. వచ్చే నెల 1వ తేదీ శనివారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని స్వామివారికి ప్రీతికరమైన సిందూర అర్చన, తమలపాకులతో అర్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 3వ తేదీ సోమవారం మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ, సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం(ఊరేగింపు) మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, సన్నాయి మేళంతో మాచవరం వీధులమీదుగా జరుగుతుందని చెప్పారు. భక్తులు హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆమె కోరారు. అనంతరం ఆలయ అర్చకులు గోవర్ధనం శోభనాద్రి చార్యులు, వెంకటాచార్యులు, ఆలయ సిబ్బంది భక్తులతో కలిసి హనుమజ్జయంతి వేడుకల కరపత్రాలు ఆవిష్కరించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



పూజలు నిర్వహిస్తున్న తోలేటి శ్రీకాంత్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 331వ ఆరాధనా మహోత్సవాన్ని పాతబస్తీలో శనివారం వైభవంగా నిర్వహించారు. సంఘానికి చెందిన టీకె నరసింహాచార్యులు ఎడ్యుకేషన్ ట్రస్ట్ భవనంలో ఆరాధన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత స్వామి వారి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు సంఘసంస్కర్తగా మూఢ నమ్మకాలు పారద్రోలి ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. ప్రజలను చైతన్యపరిచిన కారణ జన్ములని కొనియాడారు. మహిళలకు సమాన హక్కులు వస్తాయని భవిష్యత్‌లో జరుగబోయే అనేక విషయాలు కాలజ్ఞానం ద్వారా తెలిపారని వివరించారు. మానవులందరూ సమానమని అందరూ ప్రేమ భక్తి మార్గాల్లో ముందుకు సాగాలని తెలిపిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన బోధించిన అంశాలను అందరూ పాటించాలని కోరారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నడిపల్లి ప్రసాద్, పెదప్రోలు బ్రహ్మం, ఎం.జేజిబాబు, విరమల్లు చిన్మాయాచారి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజస్వామి సంకీర్తనలు



విజయవాడకల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో దుర్గాపురం శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి 257 వ జయంతి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో యువ సంగీత కళాకారులతో పాటు సీనియర్ సంగీత విద్వాంసులు భక్తిగా త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. ముద్రాడి వైష్ణవి, కె.శ్రావ్య శివానీ, గుడిపాటి శ్రీనిధి, గుడిపాటి సింధు, డీవీఎల్ఎస్ శాస్త్రి, అద్దేపల్లి వంశీకృష్ణ, చినముక్కేవి సంజన, గుడిపాటి లలిత, ముదిల శృతి, జి.తీర్థ ప్రియాంజని, వెంపరాల సౌమ్య, రాయప్రోలు రచిత, అవసరాల రుక్మిణి, టి.పవిత్ర, కొమ్మా జోస్యుల అలేఖ, చారుమతి పల్లవి, అంజనా సుధాకర్ తదితరులు త్యాగరాజ స్వామి రచించిన సంకీర్తనలను గానం చేశారు.